


## ముద్దుకి మూడే ముళ్ళంట

**తేనెటీగ** డైరెక్టర్ నందకుమార్ 1992లో ఓసారి మద్రాస్‌లో ఓ ఇంగ్లీష్ సినిమా కేసెట్‌ని చూపించి చెప్పారు.




"ఈ పాయింట్ మీరు కథ అల్లడానికి పనికి వస్తుందేమో చూడండి."

పేరు గుర్తులేదు కానీ ఆ కథలోని ప్రధానాంశం, తమలో తండ్రి ఎవరో తెలీని ముగ్గురు ఉద్యోగస్థులు ఓ బిడ్డని తమ ఆఫీస్‌లో రహస్యంగా దాచి పెంచడం. దాని స్ఫూర్తితో ఆలోచించి ఓ కథని తయారుచేసుకున్నాను. అదే ‘ముద్దుకి మూడే ముళ్ళంట’. స్థూలంగా కథ.

డిసిప్లిన్ అంటే ప్రాణం పెట్టే రిటైర్డ్ మేజర్ రంగనాయకులు మేనేజర్‌గా ఉన్న మదరిండియా అనే కంపెనీ గోడౌన్‌లో సుందర్రావు, రాఘవ, నరేంద్ర పనిచేస్తున్నారు.

మొదటి వ్యక్తి సుందర్రావు భార్య శైలజ అనుమానపు పిశాచి. ఆడదాని నీడ తొక్కినందుకు కూడా ఎగిరిపడుతుంది.

రెండో ఉద్యోగి రాఘవ భార్య అంజన అమాయకురాలు. పత్రికల్లో వచ్చే ఇల్లాలికి సలహాలు, చిట్కాలు పాటిస్తూ భర్తని ఇబ్బంది పెడుతూంటుంది. మూడోవాడు బ్రహ్మచారైన సురేంద్ర. పోలీస్ ఆఫీసర్ కూతురు సుమిత్రతో ప్రేమలో పడతాడు. అదే ఆఫీస్‌లో నాయక్ అనే రిటైర్డ్ మిలటరీ సైనికుడు వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. అతని కూతురు దస్లీ ఆఫీస్‌లో చిన్న టీ దుకాణాన్ని నడుపుతూ సిబ్బందికి టీ, టిఫిన్లు చేసిస్తూంటుంది. అందంగా ఉండే దస్లీ మీద ఈ ముగ్గురు మగాళ్ళకి ప్రత్యేక ఆసక్తి ఏర్పడుతుంది. అదే ఆఫీస్‌లో పని చేసే సువర్ణ 42 ఏళ్ళ అవివాహిత. ప్యూన్ ఆర్. అప్పారావుకి ప్రవృత్తి రీత్యా రూమరప్పారావు అనే ముద్దు పేరు వచ్చింది. అతను వదంతులని అంతా నమ్మేలా ఇట్టే తేలిగ్గా అల్లి ప్రచారంలో పెడుతూంటాడు.

ఓ ఆదివారం మగాళ్ళు ముగ్గురూ మూడు కారణాలతో ఆఫీస్‌కి వేరే వేరే సమయాల్లో వస్తారు. మర్నాడు సోమవారం దస్లీ తనని ఆ ముగ్గురూ బలాత్కారం చేసారని ఏడుస్తూ మేనేజర్‌కి ఫిర్యాదు చేసింది. నాయక్ దస్లీని తన స్వగ్రామానికి పంపేస్తాడు. ఆమెకి కొడుకు పుట్టాక నాయక్ బిడ్డని తెచ్చి ఆ ముగ్గురే పోషించాలని చెప్పి ఆఫీస్‌లో వదిలేస్తాడు. అదే ఆఫీస్‌లో పని చేసే సువర్ణ ఆ బిడ్డని పెంపకానికి

తీసుకుంటుంది. వాడి పోషణకి ఆ ముగ్గురి జీతంలోంచి నెలనెలా కొంత కోసి రంగనాయకులు సువర్ణకి ఇస్తాడు. సుందర్రావు భార్యకి ఇది తెలిసి అతన్ని సాధిస్తూంటుంది. రాఘవ భార్య అతన్ని వదిలి వెళ్ళిపోతుంది. కొద్ది రోజులకి ఆ బిడ్డకో ప్రాణాంతక రోగం వచ్చింది. ఆపరేషన్‌కి ఆ ముగ్గుర్నీ బెదిరించి రంగనాయకులు తలో ఏభై వేలు ఇప్పిస్తాడు. చిన్న మలుపుతో నవల సుఖాంతం అవుతుంది.

మా ఇంట్లో అంతకు ఐదారేళ్ళ మునుపు పని చేసిన నిర్మాణ కూలీ లంబాడీ తెగకి చెందిన దస్లీ. ఆమె పేరే ఈ నవల్లో వాడాను. దశమి రోజు పుట్టింది కాబట్టి ఆమెకి దశమి అనే పేరు పెడితే అది దస్లీగా మారిందని కూడా చెప్పింది.

ఆద్యంతం హాస్యంగా సాగే ఇందులోని పాత్రలన్నీ కామెడీ పాత్రలే. 2000లో ఈ మెయిల్ వచ్చిన కొత్తల్లో నా మిత్రులు అనేక జోక్స్ నాకు పంపేవారు. వాటిలో కొన్ని ఈ నవల్లో వాడాను. ఆ మంచి జోక్స్ అన్నీ నేడు మరుగున పడిపోయినవే కాబట్టి మరోసారి ఇది రాయడానికి చదివినప్పుడు తాజాగా ఫీల్ అయ్యాను. కొన్ని సన్నివేశాలు నన్నే నవ్వించాయి. ముఖ్యంగా పెళ్ళి చూపుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే వ్యాసం చదివి పెళ్ళి చూపులని నిర్వహించే అధ్యాయం నన్ను నవ్వించింది.

ఝాన్సీరాణి అనే సినిమా కోసం వేటూరి సుందర్రామ్మూర్తిగారు రాసిన ఓ పాట పల్లవి 'రేపో మాపో పెళ్ళంట – ముద్దుకి మూడే ముళ్ళంట' నాకా పదాలు నచ్చడంతో గతంలో ఓ కామెడీ నవలకి 'రేపో మాపో పెళ్ళంట' అనే పేరుని, దీనికి ముద్దుకి మూడే ముళ్ళంట అనే పేరుని పెట్టాను.

ఇలాంటి ఇతివృత్తంతో గతంలో రెండు నవలలు రాసాను. మొదటిది సస్పెన్స్ నవల 'రేపటికొడుకు'. రెండోది పూర్తి హాస్య నవల 'వెడ్డింగ్ బెల్స్'. రెండో దానికి కూడా ఓ హాలీవుడ్ సినిమానే ఆధారం. ఐతే ఈ మూడిటికి ఉన్న కామన్ పాయింట్ తండ్రి ఎవరు? అన్నది వదిలేస్తే ఒకదానికి, మరోదానికి సంఘటనల్లో, సందర్భాల్లో, కథనంలో పోలిక లేదు.

అప్పటికే దాదాపు చాలా వారపత్రికలు మూతబడటంతో దీన్ని డైరెక్ట్ నవలగా రాసాను. మే 2004లో దీన్ని లిపి పబ్లికేషన్స్ పుస్తకంగా ప్రచురించింది. అప్పటి ధర రూ.50. ప్రస్తుతం స్టాక్‌లో లేదు 2019లో ఇది పునర్ముద్రించబడుతుంది.

ఇది వెలువడే నాటికి శ్రీ జంధ్యాల లేరు. నవలలని సినిమాగా తీసే దర్శకులు కూడా లేరు. లేదా కొన్ని కథా మార్పులతో సినిమాగా వచ్చేదేమో?

సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడ ఓ విషయం ప్రస్తావిస్తాను. నవలగా వెలువడ్డ కథని సినిమాగా తీసినప్పుడు సినిమా కథలో చోటుచేసుకున్న మార్పులు, చేర్పులు ప్రేక్షకులకి తెలీవు కాబట్టి ఆ మొత్తం కథని ఆ రచయితే రాసాడని భ్రమిస్తారు. ఈ మధ్య కొత్త ట్రెండ్, దర్శకుడు కనీసం ఐదారుగురు కథారచయితలతో ఆ కథని చర్చించడం. అతనికి సలహాలు ఇచ్చేవారు కథని సంపూర్ణంగా మార్చేస్తారు. డబ్బు తీసుకున్న ప్రతీ కథా రచయితా కథ సరిగ్గా ఉందని ఒప్పుకోక మార్పులు చెప్పి తీరుతాడు. ఇలా నా మేఘమాల సినిమాకి 27మంది రచయితలకి పారితోషికం చెల్లించానని దాని నిర్మాత నాకు చెప్పారు. అది తెలీని ప్రేక్షకులు ఇంత మంచి రచయిత ఇంత చెత్త కథని రాసాడేమిటి? అనుకుంటారు.

ఇటీవల విడుదలైన ఆచారి అమెరికా యాత్ర ఇందుకు మరో చక్కటి ఉదాహరణ. నేను నిర్మాత, దర్శకులకి ఇచ్చిన కథకి, తీసిన కథకి చాలా తేడాలున్నాయి అని చూసిన మిత్రులు చెప్పిన దాన్ని బట్టి తెలిసింది. క్రితం వారం అది టి.విలో వచ్చినప్పుడు కొంత చూసాను. హీరో బాహుబలాన్ని చూపించాలనే తపనతో అనుకుంటా, గుడిలోని ధ్వజస్తంభం నేలకూలేప్పుడు, ఓ పిల్లాడిని రక్షించడానికి హీరో వచ్చి తన భుజాన్ని అడ్డుపెట్టే దృశ్యం చూసాక ఇక దాన్ని చూడటం మానేసాను. ఆ కుర్రాడు నిశ్చలంగా కూర్చుంటాడు తప్ప భయపడడు., ఏడవడు, సహజమైన స్పందనగా పారిపోడు. నిజానికి ప్రేక్షకుడికి అసలా పిల్లవాడి మీద ఎంత సానుభూతి వస్తే అంత హీరోయిజం మనసుకి పట్టుకుంటుంది. సినిమాలో ప్రేక్షకుడ్ని లీనమవకుండా చేసేది ఇలాంటి మృదువైనవి విస్మరించడమే. ఐనా పౌరోహిత్యం చేసే ఓ యువకుడికి వేదబలం, మంత్రబలం తప్ప బాహుబలం అవసరం ఏమిటి చెప్పండి? కామెడీ సినిమాల్లో కామెడీ ఫార్ములాని వదిలేస్తే

ప్రేక్షకులు అలాంటి సినిమాలని వదిలేస్తారు. ధ్వజస్థంభం కూలడం అరిష్టం అని తెలీని డైరెక్టర్‌కి ఎవరో చెప్పిన ఆ పాయింట్ నచ్చడం దురదృష్టకరం. ఆ దృశ్యం మొదట్లో ఉండటం మరీ ఘోరం.

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***

Post your comments